వలస కూలీలపై లాఠీ ఛార్జీని ఖండిస్తూ ఈరోజు (16 మే) వలస కూలీలను పరామర్శించిన సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబూరావులు

–జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

కూలీలను కాపాడాల్సిందిపోయి..కొడతారా?
– గుంటూరుజిల్లా కలెక్టరు, ఎస్పిలను మధు నిలదీత
– వారిని క్షేమంగా స్వస్థలాలకు పంపుతామని అధికారులు హామీ
– సిపిఎం జిందాబాద్ అంటూ కూలీలు నినాదం

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన కూలీలతో పాటు ఎపికి చెందిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వలస కూలీలను జాగ్రత్తగా కాపాడాల్సింది పోయి..కొడతారా? అంటూ అధికారులపై సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు మండిపడ్డారు. వలస కూలీలను కల్పించిన పునరావాస కేంద్రానికి సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, స్థానిక నేతలతో కలిసి వెళ్లి కూలీలను పరామర్శించారు. వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్వస్థలాలకు వెళుతున్న తమపై పోలీసలు దాడి చేశారని, వెళ్తామని అడిగితే పోలీసులు బెదిరిస్తున్నారని కన్నీరుమున్నీరయ్యారు. పునరావాస కేంద్రం వద్దనున్న గుంటూరుజిల్లా కలెక్టర్, ఎస్పి, తదితర అధికారులను మధు గట్టిగా నిలదీశారు. వలస కూలీలను అతిథుల్లా ఆదుకోవాల్సింది పోయి..విచక్షణారహితంగా కొట్టడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిత్తరపోయిన అధికారులు లాఠీచార్జి జరగలేదని కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించారు. చివరికి కూలీలను సురక్షితంగా వారి స్వస్థలాలకు పంపుతామని హామీ ఇచ్చారు. అనంతరం మేమున్నాం అంటూ సిపిఎం నాయకులు కూలీల్లో ధైర్యాన్ని నింపారు. తమపై జాలి చూపి, వారిపక్షాన నిలబడినందుకు సిపిఎం పార్టీ జిందాబాద్ అంటూ కూలీలు ఆనందోత్సాహంతో నినదించారు.

**అసలేం జరిగిందంటే..**

పొట్టకూటికోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, మహరాష్ట్రకు చెందిన వారితో పాటు ఎపికి చెందిన విజయనగరం, శ్రీకాకుళానికి చెందిన కూలీలు తమిళనాడు నుండి కాలినడక, సైకిళ్లపై స్వస్థలాలకు బయల్దేరారు. వీరంతా గుంటూరుజిల్లా, తాడేపల్లి దగ్గర్లోని కనకదుర్గ వారధి దగ్గరకు వచ్చేసరికి పోలీసులు అడ్డుకుని కూలీలందర్నీ పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడి పరిస్థితులు నచ్చక, ప్రభుత్వంపై నమ్మకం లేక మమ్మల్ని వదిలేయండి సార్...మేం వెళ్లిపోతాం అంటూ సైకిళ్లతో వారధివరకు వచ్చేశారు. విషయం తెలుసుకున్న సిఐ మురళీకృష్ణ తన సిబ్బందితో కూలీలను అడ్డుకుని, లాఠీచార్జి చేశారు. విషయం తెసుకున్న సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు పార్టీ నేతలతో కలిసి కూలీలున్న పునరావాస కేంద్రానికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడే ఉన్న గుంటూరుజిల్లా కలెక్టరు ఐ.శామ్యూల్ ఆనంద్ కుమార్, ఎస్పి పిహెచ్డి.రామకృష్ణ, ఎఎస్పి కె ఈశ్వరయ్య, రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఘటనపై ఆరాతీశారు. ఈ క్రమంలో కలెక్టర్, ఎస్పి, సిబ్బందికి మధుకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అధికారుల తీరుపై మధు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులపై లాఠీచార్జి చేసిన సిఐ మురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొట్టచేతపట్టుకుని వచ్చిన కూలీలను అతిథుల్లా ఆదరించాల్సిన అధికారులు, కొట్టడం దుర్మార్గమన్నారు. వారిని టెంటుల్లో కాకుండా బిల్డింగుల్లోకి పంపాలని, అన్ని వసతులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సిపిఎం కార్యాలయాలను వాడుకోవాలని కోరారు. దీంతో కలెక్టర్, ఎస్పి కూలీలను సురక్షితంగా వారి స్వస్థలాకు రైళ్లు, బస్సుల్లో పంపుతామని, వారికి ఏ కష్టం రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో అక్కడున్న కార్మికులంతా సిపిఎం జిందాబాద్... అంటూ ఆనందంతో చేసిన నినాదాలతో పునరావాస కేంద్రం మార్మోగింది. సిపిఎం నాయకులకు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు. కూలీలను పరామర్శించిన వారిలో సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి కృష్ణయ్య, స్థానిక నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

= = = =